కథా కౌముది



# ఒక చిన్న..'మాట'

కిరణ్ బాల



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో సాధారణ ప్రచురణ కథ

'మళ్ళీ డ్రింక్ చేసి వచ్చావా?'

'లోపలికి రావాలా వద్దా? డోర్ దగ్గరే ఎంక్వైరీలా!' కాస్త చిరాగ్గా అన్నాను.

'డోర్ తెరవటంతోనే గుప్పున వాసన వస్తుంటే... ఇంకా ఎంక్వైరీ అవసరమా!'

'మరి క్వశ్చన్ వేయటం ఎందుకు... తెలిసీ!' షూస్ విడిస్తూ అన్నాను.

తల వెంట్రుకలు పైకి ముడేసుకుంటూ నా ఎదురుగా నిలబడి 'అంటే నేనేమీ అడగొద్దా నిన్ను?' తీవ్రంగా ప్రశ్నించింది మధు .

నాకు ఒళ్ళు మండింది.

'ఏదో ఫ్రెండ్స్‌తో కాస్త డ్రింక్ చేస్తే ఇంత రాద్ధాంతం చేయాలా!' నేనూ తీవ్రంగానే అంటూ బాత్రూంలోకి వెళ్లాను.

డోర్ మీద ఒక్కదెబ్బ చరిచి 'గంట చేయకు, త్వరగా రా...!' అంది అదేస్థాయిలో.

'ఏం పీక్కుంటావో పీక్కో' అని మనసులోనే అనుకున్నాను.

మా పెళ్ళయి ఎనిమిది నెలలైంది. నాలో మధుకి నచ్చనిది ఈ ఒక్క విషయం. మధులో నాకు నచ్చనిది ఆ పోట్లాడే స్వభావం.

రోజూ కంటే ఓ అయిదు నిమిషాలు ఆలస్యం చేసి బయటకి వచ్చాను. టవల్ పట్టుకుని డోర్ దగ్గరే నిలబడింది మధు. టవల్ తీసుకుని తుడుచుకుంటూ 'మాంచి మసాలా వాసనొస్తుంది. చికన్ ఫ్రైయా!' ముక్కు ఎగబీలుస్తూ అన్నాను.

'నీ ముక్కుకి వాసనకూడా వస్తుందా?' ఎద్దేవగా అంది... చక్రాల్లాంటి కళ్ళని తిప్పుతూ.

డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను. మధు వైపు చూసాను. ఊడిపోతోన్న జుట్టుని మళ్ళీ పైకి ముడేస్తూ వంటింట్లోకి వెళ్ళింది. ఒక్కొక్కటే గిన్నెలు తెచ్చిపెట్టసాగింది. నేవెళ్ళి ప్లేట్స్ తెచ్చిపెట్టాను. డిష్ మూత తీసి చూసాను. గట్టిగా వాస

న పిలుస్తూ... 'దొంగా! చికెన్ ఫ్రై చేసికూడా మాట్లాడవు!' అంటూ మధు చేయి పట్టుకున్నాను. విదిలించుకుంది. ఆ విదిలించుకోవడంలో... జుట్టుముడి మళ్ళీ ఊడిపోయింది. సిల్కీ హేర్! జారిపోతుంటుంది. మధు జుట్టంటే నాకెంతో ఇష్టం. ఇప్పుడు తన మూడ్ బాలేదు, కానీ లేకపోతే...!

మధు మళ్ళీ ముడివేసుకుంటూ ఫ్రిజ్ దగ్గరికెళ్ళింది. నాకో తమాషా ఆలోచన కలిగింది. లేచి బెడ్ రూంలోకి వెళ్ళాను.

'అలిగి పడుకుంటే చికెన్ ఫ్రై ఏడుస్తుంది!' అంది మధు.

మామూలు మూడ్‌లోకొస్తున్నట్లుంది.

'అంత వెర్రి ముఖాన్ని కాదు, వస్తున్నా!' అదే స్థాయిలో అంటూ డ్రెస్సింగ్ టేబుల్ డ్రాలోంచి హేర్ పిన్ తీసి చేతిలో పట్టుకుని వచ్చాను.

మధు వడ్డిస్తోంది. మళ్ళీ జారిపోబోతోన్న తన వెంట్రుకల్ని రెండు చేతుల్తో పట్టుకుని క్లిప్ పెట్టాలని నా ఆలోచన. పట్టుకోవటంతోనే 'ఏయ్! ఏం చేస్తున్నావ్' విదిలించబోయింది.

'అయిపోయిందయిపోయింది మా బుజ్జికదూ!' అంటూ హేర్ పిన్ పెట్టేసాను అడ్డదిడ్డంగా.

చేతుల్తో తల తడుముకుని, వస్తోన్న నవ్వుని ఆపుకుంటూ, తినమని ప్లేట్‌వైపు చూసింది.

తన వంటని అప్రిషియేట్ చేస్తోంటే... విషయం మర్చిపోయి హేపీ మూడ్‌లోకి వచ్చేసింది.

*****

బెడ్‌మీదికి రాగానే మధు మీద చేయి వేయబోయాను. విదిల్చికొట్టింది.

'అరె, ఒక్కదానివే పోయి చికెన్ తెచ్చావా?'

..............................................................

'స్కూటీ తీసుకొని పోయావా?'

'లే, ఏయిరోప్లేన్‌లో పోయా!'

'చూడు ఎప్పుడో ఓసారి అంబానీనై - నీకు ఏయిరోప్లేన్ గిఫ్ట్ ఇస్తా!'

'అంబానీ నీలాగా రోజూ డ్రింక్ చేసి ఇంటికి వెళ్ళడు'.

'నీకేం తెలుసు? ఏమో!'

'ఏమో ఏంటి - ఆయన కనక అట్లా చేసేవాడే అయితే వాళ్ళావిడ ఎప్పుడో ఓసారి ఆ ఎయిరోప్లేన్ నుంచి కిందికి దూకేసి ఉండేది'.

'నయం - నువ్వయితే... నన్ను తోసేసేదానివి'.

'మరి తెలిసి కూడా తాగడం ఎందుకు?' వచ్చే నవ్వును కనిపించనీకుండా కోపం నటిస్తూ అంది.

'ఓకే, బాబా, నేను అంబాని అయినరోజున ఈ డ్రింక్ మానేస్తాను'!

'అంటే ఆ స్థాయికి రీచ్ అయ్యేదాక డ్రింక్ చేస్తావన్నమాట!' పిల్లో నా మీదకు విసిరేస్తూ అంది.

ఓ పెద్ద ప్రమాదాన్ని తప్పించుకుంటున్నట్టు యాక్షన్ చేస్తూ 'ఇవాల్టికిక యుద్ధం విరమిద్దామా' అన్నాను. మధు కోపంగా చూసింది.

'ఫ్రెండ్స్‌తో కలిసి తాగొద్దని ఎన్ని సార్లు చెప్పాను?' అంది చిన్నపిల్లాడ్ని నిలదీసినట్లు.

'ఫ్రెండ్స్‌తో కాకపోతే మరి ఎవరితో కలిసి తాగాలి?' చప్పున నోరు జారాను.

'అంటే తాగాలి అన్నది మస్టా? సిగ్గులేదు నీకు. వైఫ్ ఇంట్లో ఒక్కతే వుంటది. అరె, ఇంటికి తొందరగా రావాలని లేదు'.

'....................'

'ఇకముందు డ్రింక్ చేయనని చెప్పు' బెడ్ మీద మఠమేసుకొని కూర్చొని చేతులు తిప్పుతూ అడిగింది.

నేను మాట్లాడలేదు.

మధుకి మళ్ళీ కోపం ఎక్కువయింది. చూపుడు వేలితో బెదిరిస్తూ... 'ముందు లేచి కూర్చో' అంది. ఓబిడియంట్ స్టూడెంట్‌లా లేచి కూర్చుని చేతులు కట్టుకున్నాను.

'నఖరాలు చెయ్యకు గానీ, చెప్పు! 'డ్రింక్ చెయ్యవు కదా!' బెదిరించింది.

'యస్ మేడమ్!' అన్నాను. అంటే మనసులో చేస్తాను అని అర్థం!

'అంటే చేస్తావనా - చెయ్యవనా!' గద్దించింది మధు.

ఉలిక్కి పడి, 'మరీ సడెన్‌గా అంటే ఎలా' నసిగాను.

'ముందు సండే సండే పోయేవాడివి - ఇప్పుడేంటి ఇట్లా తయారయ్యావ్!' మధులో ఓ టీచరమ్మ కనపడ్తోంది నాకు. ఐడియా!

'మఠమేసుకుని కూర్చున్నావు. కాసేపు ధ్యానం చెయ్యి మధూ, మనసు ప్రశాంతమవుతుంది' జాలిగా ముఖం పెడుతూ... అన్నాను తప్పించుకోవాలని.

'చేస్తా, చేస్తా, ధ్యానం చేస్తా. నువ్వేమో బలాదూర్‌గా తిరిగిరా! చికెన్ ఫ్రైలు చేసిపెట్టుకుంటూ నిన్ను పడుకోబెడ్తూ - నేను ధ్యానం చేస్తా!'

'అదికాదు మధూ! నువ్ హాయిగా పడుకుంటే నీ తల నిమురుతూ నేనూ పడుకుంటాను కదా!' గోముగా అన్నాను.

తల అనగానే నేను క్లిప్ పెట్టిన సంగతి గుర్తుకొచ్చింది కాబోలు. తల విదిలించి క్లిప్ ఊడదీసి దూరంగా విసిరేసింది. టప్పుమని శబ్దం చేస్తూ ఎటో పడిపోయిందది.

'అయ్యో... పాపం... నీకు భయపడి ఏ బీరువా కిందో దూరింది కాబోలు క్లిప్పు!' అన్నాను భయం నటిస్తూ...

'చాలు, మజాకా! సీరియస్ మ్యాటర్‌ని సిల్లీగా చెయటంలో ఫస్ట్ నువ్వు!' అంది చిరుమందహాసంతో.

అంతటితో సద్దుమణిగింది. ఆ రాత్రి గడిచింది.

*****

మర్నాడు ఆఫీస్ పని తొందరగా ముగించుకుని ఇంటికి తయారయ్యానో లేదో - చాన్నాళ్ళ తరువాత కలవటానికొస్తున్నానని, ఫలాన హోటల్లో పార్టీ అని చెప్పాడో ఫ్రెండ్. మనసులో గుబులైనా - తప్పదని వెళ్ళాను. కార్లో ఎక్కికూర్చోని మధుకి ఫోన్ చేసి చెప్పాను. 'డ్రింక్ చేసావంటే చూడు, ఏదో కంపెనీకి కూర్చో... అంతే!' ఆర్డర్ జారీ చేసింది.

నేను తాగేది రెండు పెగ్గులే! ఇంటికి రాగానే డోర్ దగ్గరే పసికట్టేస్తుంది మధు. పోట్లాటకి దిగుతుంది. చూసీ చూడనట్లు ఊరుకోదు. తనతో వచ్చిన చిక్కే అది!

*****

ఈసారి మధు డోర్ తెరిచిపెట్టి, ఏదో పెద్ద ఎగ్జామ్‌కి ప్రిపేర్ అవుతున్న దాన్లా పుస్తకాలేవో ముందేసుకుని హాల్లో కూర్చుంది.

వచ్చీరావటంతోనే 'హాయ్ బేబీ' అన్నాను... లోపల బిక్కుబిక్కు మంటోన్నా! మధు విననట్టు వూరుకుంది.

'ఓహ్... రీడింగ్! మంచి అలవాటు!' వాతావరణాన్ని తేలిక చేయాలని నా ప్రయత్నం. మధు మాట్లాడలేదు. ఫ్రెష్ అప్ అయి వచ్చాను. ఇంకా అలాగే కూర్చుంది పుస్తకాల ముందు.

'అంతలా ఏం చదువుతున్నావురా! లే, డిన్నర్ చేద్దాం!' అంటూ ముట్టుకోబోతే విసిరికొట్టింది.

'మనిద్దరమే కదా ఇంట్లో... రాగానే పోట్లాటకు దిగటమెందుకు? ఇద్దరం ఒక్కటిగా వుండాలికదా' బుజ్జగిస్తూ అడిగాను.

'ఇద్దరమొక్కటి ఎట్లా అవుతాం?' నిక్కచ్చిగా ప్రశ్నించింది మధు.

'అంటే... ఒక్కటి అంటే' నసిగాను. స్ఫురించగానే 'కలిసుండాలని!' మాట పూర్తి చేసాను.

'నువ్ నీ దోస్తులతోని కలిసుంటావు'.

'నీతో కలిసిలేనా!'

'నువ్వు లేవు, నా ఖర్మకు నేనే నీతో కలిసున్నా!'

నేను విస్తుపోయి అన్నాను, 'ఎంత తెలివైన మాటలు మాట్లాడుతున్నావ్!'

'నీవల్లే!'

'ఏంటి సినిమా పేరా!'

'కాదు, తెలివి నీవల్లే వచ్చింది'.

'మంచిదేగా, "తెలివిగలవారు కొత్త విషయాలు కనిపెట్టెదరు" ' కొటేషన్‌లా అన్నాను.

'తాగుబోతులు కొంపలు ముంచెదరు' వెక్కిరిస్తూ అంది.

'కాస్త తాగగానే తాగుబోతునైపోతానా!'

'రోజూ తాగితే... తాగుబోతులే!'

'అయితే నువ్వు రోజూ టీ తాగుతావ్. అది కూడా అంతేకదా!'

మధు లేచి నిల్చుంది. యుద్ధానికి నడుం బిగించింది. 'నాతో కలిసి నువ్వూ తాగుతావు కదా టీ! టీ తాగితే... డ్రింక్ చేసినట్టా ? దానికీ దీనికీ పోలిక ఏంటి?'

'అలవాటు'

'అలవాటు అంటే - మంచి అలవాట్లూ వుంటాయి, చెడ్డ అలవాట్లూ వుంటాయి'.

'టీ మంచి అలవాటా?' పోటీపడుతూ అడిగాను.

'నువ్వు తాగే డ్రింక్స్ మంచి అలవాటా?'

'అసలు రోజూ తాగితే... దానికి సరెండర్ అయితే అలవాటు! నేనట్లా కాదు!'

'ఈ వీక్ అంతా రోజూ డ్రింక్ చేసి వచ్చావు. అదే అలవాటైపోతుంది!'

'ఈ వీక్, అనుకోకుండా పార్టీలు...'

'ప్రామిస్ చెయ్, నెక్ట్స్ వీక్ తాగనని!'

'వై నాట్, షూర్! ఐ ప్రామిస్!'

'ఏ ఫ్రెండ్‌గాడు పిలిచినా పోవద్దు.'

'అట్లంటే ఎట్లా?'

'పోతే మళ్ళీ తాగుతావురా నువ్వు!' పెద్ద ఆరిందాన్లా నడుం మీద ఎడమచెయ్యి పెట్టుకుని కుడిచేయి తిప్పుతూ అంది.

'సరే... పోను!' వెంటనే ఒప్పేసుకున్నాను తాత్కాలికంగా.

*****

ఒకవారం, కష్టంమీద అన్నీ వదులుకుని ఇంటికి వచ్చేసాను. మళ్ళీ వారంలో కంపెనీ మీటింగ్స్, బర్త్‌డేలూ, ట్రాన్స్‌ఫర్స్... అలా ఏదో ఓ పార్టీకి అటెండ్ కావడం, మళ్ళీ డ్రింక్ తీసుకోవలసి రావడం - ఇంటికొచ్చి తిట్లు తినడం పరిపాటి అయ్యింది నాకు.

అలానే ఓ రోజు ఇంటికి వెళ్ళాను. కాలింగ్ బెల్ శబ్దానికి డోర్ తీసి బెడ్ రూంలోకి వెళ్ళిపోయింది మధు. ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడితే ఏమవుతుందో తోచక కిచెన్‌లోకి వెళ్ళి చూసాను. ఎక్కడా వంట చేసిన అనవాళ్ళు లేవు. బెడ్‌రూంలోకి వచ్చి వ ధుతో అన్నాను - 'అలిగావా జానూ, ఏం వండలేదు'. చివ్వున బెడ్ మీంచి లేచి కూర్చుని 'నీకు తాగించినోళ్ళు... ఇంత అన్నం ె ఎట్టి పంపరా? అక్కడే తిని రాకపోయావ్' అంది.

'అయ్యో, నువ్వు ఒక్కదానివే వుంటావు కదా, వాళ్ళెంత... బిర్యాని అర్డర్ ఇచ్చినా... తినకుండా నీకోసం ఇంటికొచ్చేస్తాను ఎప్పు డూ... తెలుసా!' చాలా అమాయకం నటిస్తూ అన్నాను.

మధు నావైపు ఓ పిచ్చి చూపు చూసింది. 'పెద్ద క్రీమ్ బిస్కెట్ వేస్తున్నావు రా!' అంది డల్‌గా!

మధు చేయి పట్టుకుని 'లే... అయిదు నిమిషాల్లో రెడీకా. బయట తినొద్దాం' అన్నాను.

లేచింది మధు. లోపల ఆకలేస్తున్నట్టుంది. అమ్మయ్య గండం గడిచింది... ఈ పూటకి అనుకున్నాను.

*****

వారంలో ఏ ఒక్కరోజో తప్ప, దాదాపు ప్రతిరోజూ నేను కాస్తో కూస్తో తాగుతూనే వున్నాను. ఒకానొక సమయంలో నన్ను నేను తరచి చూసుకుంటే నాకిది అలవాటై పోయిందేమో అనిపిస్తుంది. ఏ ఒక్కరోజన్నా... తాగని నాడు నిద్ర పట్టేలాలేదు. ఏమిటీ, నే ను ఇలా అయ్యాను? ఎక్కడో లోపల కాస్త భయంగా వుంది. ఈ మధ్య నైట్‌కి మధు వండటం మానేసింది. నేను బ్రతిమిలా డి బయటికి తీసుకెళ్ళి మంచి హోటల్లో డిన్నర్ చేయించాల్సి వస్తుంది. మధు నాతో పోట్లాడకుండా - ఇదో రకంగా కక్ష సాధిస్తు ందా అనికూడా అనిపిస్తుంది.

ఓ రోజు ఆఫీస్ ఫైల్ ఒకటి ఇంట్లో మరిచిపోయాను. ఉదయం ఆఫీసుకొచ్చాక తెలిసింది. ఆదరా బాదరగా ఇంటికెళ్లాను. డోర్ తీసేవుంది. మెల్లగా తోయగానే తెరుచుకుంది. హాల్లోంచి మాటలు వినబడుతున్నాయి. మధు, పక్కింటి ఆంటి గొంతు. ఆమె మధుకంటే పదేళ్ళు పెద్దది కావచ్చు. ఆమె ఒక్కతే ప్రస్తుతం మధుకి ఫ్రెండ్, అప్పుడప్పుడూ వస్తూంటుంది. టీవీ చూస్తూ మాట్లాడుకుంటున్నారు. నేను ఫ్రంట్ రూంలో ఫైల్‌కోసం వెతుకుతున్నాను. చప్పుడైందేమో... 'ఎవరు?' అంది మధు. నేను స మాధానం ఇచ్చాను, కారణం చెప్పాను. టీవీలో ఒక మగ గొంతు... బాగా డ్రింక్ చేసి మాట్లాడుతున్నాడు.

'మద్యం సేవించటం ఆరోగ్యానికి హానికరం!' పెద్దగా చదివింది మధు.

స్మోకింగ్, డ్రింకింగ్‌లాంటివి టీవీలో వస్తున్నపుడు కింద హెచ్చరికలు జారీ అవుతుంటాయి అక్షరాల్లో! ఇది మామూలే.

'హానికరం అంటే హామ్‌ఫుల్ కదా ఆంటీ! మరి తెలిసికూడా ఈ బద్మాష్‌గాళ్లు ఎందుకు తాగుతారో!?'

'వాళ్ళకి అందులో ఏదో హ్యాపీనెస్ దొరుకుతుంది కాబోలు' అది పక్కింటి ఆంటీ వాయిస్.

'అసలు హానికరం అని చెప్పే బదులు వాటిని తయారు చేయటం మానాలి కదా ఆంటీ! గవర్నమెంట్‌ని అనాలి, తాగొద్దని చెపుతారు మళ్ళీ లైసెన్స్‌లు ఇస్తారు'.

'అందరూ తాగుతారా ఏంటి, తాగేవాళ్ళకి బుద్దుండాలి!'.

'నిజమే, అడ్డగాడిదలకి బుద్ధుండాలి. వేస్ట్ ఫెలోస్!'

మధు మాటల్లో కసి. అదంతా నన్నుద్దేశించే!

'అబ్బో, ఈ హీరోయిన్! ఇంత సెంటిమెంట్ ఏంటిరా బాబో! మొగుడ్ని ఒక్కటి ఈడ్చి తన్నక!' మధు వాయిస్!

నేను హాల్లోకొచ్చి యథాలాపంగా టీవీ చూసాను. ఏదో పాత సినిమా అనుకుంటా!

'హస్బెండ్ రోజూ డ్రింక్ చేసి, సగం బేవూఫ్ అయి వస్తుంటే - ఈమెకి ఇంత పేషన్స్ ఏంటి ఆంటీ!' మధు మాటవిసురులు!

'ఏదైనా... సంసారం కూల్‌గా వుండాలి. గొడవ పడితే ఏమొస్తుంది?' అంది ఆంటీ.

'అట్లా చెప్పండి ఆంటీ! మొగుడ్ని ఆటాడించకూడదు. వాడికీ మంచీ చెడూ తెలుసు అని!' కల్పించుకుని అన్నాను అక్కడిద
ాకా వెళుతూ...

'ఇక్కడ హీరోకి చెడే తెలుసు!' అంది మధు సీరియస్‌గా.

'ఇక్కడ కిశోర్‌గాడికి మంచే తెలుసు' అన్నాను నన్ను నేను చూపించుకుంటూ.

ఆంటీకి అంతా తికమకగా వున్నట్టుంది... మా ఇద్దరినీ మార్చి మార్చి చూస్తోంది.

'ఏం మంచి తెలుసు నీకు - ఏ రాత్రిదాకానో ఫ్రెండ్స్‌తోని తాగొచ్చి... నన్ను, సతాయించడం తెలుసు! ఇది మంచా ఆంటీ?' ఆంటీని అడిగింది.

ఆంటీకి విషయం ఇప్పుడు అర్థమవుతున్నట్టుంది.

'ఏదో ఆంటీ ఈ మధ్య అనుకోకుండా ఏదో ఓ పార్టీ! నేను రెండు పెగ్గులు వేసుకుంటే... పెద్ద తాగుబోతునైనట్టు రాచి రంపా
న పెడుతోంది రోజూ!' దాచుకోవల్సింది లేదు పూర్తిగా బయటపడాల్సిందే!

'అరె ప్రామిస్‌గా చెప్పురా! నువ్వు డ్రింకింగ్‌కి హాబిట్యుయేటెడ్ కాలేదా!' నిలదీసింది మధు.

నన్ను మాట్లాడనీకుండా తనే అంది 'అసలు డ్రింక్ చేయకుండా ఉండలేవురా నువ్వు! నీ దోస్తులది కాదురా తప్పు! నీదే! దొ
ంగ రాస్కెల్! నువ్వు ఇట్లా అని తెలియక లవ్ చేసాను! నన్ను నేను తిట్టుకోవాలి'!

'దొంగ రాస్కెల్ అంటావా, పాగల్ దానా! నీ సిల్కీ హేర్‌ని కర్లీ చేయించేస్తా చూడు!' నాకు కోపమొస్తోంది, అందుకే ఊరుకో లేదు, ఎదురు మాట్లాడాను.

'ఏంటీ, ఈ సిల్కీ హేర్ చూసే కదరా లవ్ చేసావు! అయినా నువ్వు కర్ల్ చేయించేదేంటి నేనే గుండు చేయించుకుంటా!'

'నిజంగానా!' కొంచెం ఆశ్చర్యంగా అడిగాను.

దగ్గరగా వెళ్ళి తన హేర్ చేతుల్లోకి తీసుకుని 'పాపం ఎంతో కాలం వుండవు' ముక్కు ఎగబీలుస్తూ, ఏడుపులా అన్నాను.

'చేసిన నఖరాలు చాలు! నువ్వు కానీ... మళ్ళీ తాగి వచ్చావంటే ఇదిగో ఈ సిల్కీ హేర్‌ని...'

మధుని వారిస్తూ అన్నాను 'వొద్దొద్దు! అలాంటి పిచ్చి పనేం చేయకు. నేను డ్రింక్ చేయను'! అన్నాను కంగారుగా.

పెళ్ళికిముందే ఓ యేడాది ప్రేమించుకున్నాం. మధు స్వభావం నాకు బాగా తెలుసు! మొండిది. తిక్క చాలా వుంది. తన
కు నచ్చింది కావాలి. అలా అని శక్తికి మించినవి కోరలేదు కానీ, ఈ విషయంలో మాత్రం అనుకున్నంత పనీ చేస్తుంది.

'ఏయ్, మిస్టర్ కిశోర్!' నా దగ్గరగా వచ్చి ముఖంలో ముఖం పెడ్తూ అంది 'గుండు చేయించుకోమంటావా?'

ఒక యస్సై - నేరస్తుడ్ని ప్రశ్నించినట్టుగా వుంది.

ఆంటీ కల్పించుకుని అంది 'మధూ కూల్ డౌన్! తీరిగ్గా మాట్లాడుకోవాలి. ఇలా సవాల్ చేయొద్దు!'

'టైమ్ వచ్చింది ఆంటీ! సవాల్ అంటే సవాలే!' నా వైపు తిరిగి అడిగింది 'డ్రింక్స్ మానేస్తావా! లేక గుండు చేయించుకోవాలా?
'

మధుని రెచ్చగొట్టకూడదు. అన్నంత పనీ చేస్తుంది.

'మానేస్తాను.'

'అట్లారా దారికి! నాలుగురోజులు ఆగి మళ్ళీ మొదలు పెట్టవుకదా! అలా చేస్తే, జీవితమంతా నేను 'గుండు'తోనే వుంటాను!' స్కూల్‌కి సరిగ్గా రాని విద్యార్థిని నిలదీసే టీచరమ్మలా చెప్పింది.

'వారానికొక్కసారి' నసుగుతూ అన్నాను.

'ఏడువ్! మిగతా ఆరు రోజులు, పిచ్చివేషాలేయొద్దు! తొందరగా ఇంటికి తగలడాలి!'

'యస్ బాస్!'

'అసలు ఏదో ఫైల్ కోసం వచ్చిన వాడ్ని ముందు ఆఫీస్‌కి పంపించు' ఆంటీ అంది సర్దిచెబుతున్నట్టుగా.

'అక్కడ ఆఫీస్ ఏం మునిగిపోదు ఆంటీ. కానీ ఇక్కడ నా కొంప మునుగుతోంది. 'చెప్పు! ప్రామిస్ చెయి', అంది నాతో.

'ప్రామిస్!' అన్నాను.

'అట్లా కాదు, వారానికొకసారి తప్ప డ్రింక్ చేయను - అను!' అంది బెత్తంతో బెదిరిస్తునట్టు!

'ఆనాడు గాంధీజీ ఇంగ్లాండ్ వెళ్ళేటప్పుడు తల్లికి ప్రమాణం చేసారు. ఈనాడు ఇండియాలోనే నేను ఇల్లాలుకి ప్రమాణం చేయాల్సివస్తుంది' అన్నాను ఆటపట్టించాలని.

చిర్రున లేచింది మధు.

'ఏంటీ - నిన్ను నువ్వు గాంధీజీతో పోల్చుకుంటున్నావా!? అలా పోల్చుకోకు! ఏ భూకంపమో, సునామీయో రాగలదు తెలుసునా!'

'నువ్వు ప్రొద్దున లేవగానే గాంధీజీ ఫొటోకి దణ్ణం పెట్టుకుని, దినమంతా గాంధీ జపం చేసినా లాభం లేదు - ఆయనలా మాటమీద నిలబడాలి. లేకపోతే, నీ జీవితమే వ్యర్థం. తెలుసుకో!'

'సరే...! అలాగే చేస్తాను. ఆఫీసుకి టైం అవుతోంది. వెళ్తాను' కదలబోయాను.

అడ్డంగా చేతులుపెట్టి ఆపేస్తూ అంది మధు, 'మాట ఇవ్వటం మరిచారు మహాత్మా!'.

'ఏంమాట?' అన్నాను. తప్పించుకుని త్వరగా బయటపడాలన్న ఆత్రం నాలో!

కోపాన్నంతా పళ్ళబిగువున అదిమిపట్టి, 'వారానికి ఒకసారి తప్ప, డ్రింక్ చేయను అని ప్రామిస్ చేయ్!' అంది!

తప్పలేదు నాకు.

'వారానికి ఒకసారి తప్ప, డ్రింక్ చేయను. అంటే మద్యం ముట్టుకోను!' అన్నాను.

'చేతిలో చేయి వేయి!' చేయి చాపింది.

ఆ మెత్తటి చేతిలో చేయివేసాను. మధు మీద మనుసులో ప్రేమ పొంగుతోంది.

'మళ్ళీ హ్యాండ్ ఇవ్వవుకదా!' అనుమానంగా అడిగింది.

'లేదురా!' రెండో చేత్తో కూడా మధు చేయి పట్టుకుంటూ 'ఇదిగో... నీ హ్యాండ్ కూడా వేస్తున్నా' అని 'ఆంటీయే సాక్షి!' అన్నాను ఆంటీ వైపు చూస్తూ...

మధు సన్నగా నవ్వింది.

నేను మధు సిల్కీ హేర్‌ని నిమురుతూ అన్నాను 'ఐ లవ్ యూ!'

'లవ్ యూ టూ!'

ఫైల్ తీసుకుని బయటకి నడిచాను.

*****

కార్ నడుపుతూ ఆలోచిస్తున్నాను.

వ్యసనం మనిషి పతనానికి దారి తీస్తుందని... ప్రతి వ్యసనపరుడికీ తెలుసు! అయినా ఏ ఒక్కరికీ ఆత్మ నిగ్రహం వుండదెందుకో! అలావుంటే వ్యసనపరులు ఎందుకవుతారు? లేదు! నేను వ్యవసపరుడ్ని కాకూడదు!

ఆలోచిస్తే... మధు నానుండి మాట తీసుకుని మంచిపని చేసిందనిపిస్తోంది. మద్యానికి నన్ను బానిసను కాకుండా ఆపింది.

ప్రతి జాతీయ పండుగకీ జాతిపిత గాంధీజీని తలచుకుంటాం. కనీసం ఒక్కమాటకి కట్టుబడి వుండలేమా... అదీ మన మంచి కోసం... ప్రశాంత జీవితం కోసం!

సత్యం, అహింస, శాంతి అంటూ... జీవితమంతా 'నీతి - నిజాయితీ'గా బ్రతికిన జాతిపిత మహాత్మునికి నివాళిగా... ఈనాడు నేనిచ్చిన మాటకి కట్టుబడి వుండలేనా!?

ఇంట్లోంచి ఫైల్ తీసుకుని బయటికొస్తున్నప్పుడు నావైపు విజయగర్వంతో చూసిన మధు చూపు నా వెన్నంటి నట్టు తోచింది. అయితే ఆ చూపులో... ఆత్మవిశ్వాసం, నా మీద నమ్మకం కూడా కనబడ్డాయి... ఆ క్షణంలో నాకు!

ఆ నమ్మకాన్ని చివరంటా కాపాడుకోవాలి... ఆ బాధ్యత నాది!

ఇకముందు 'అగ్ని పరీక్షే - అయినా గెలవాలి!' అని స్థిరంగా మనుసులో అనుకున్నాను... గాంధీజీ సాక్షిగా!

*****

★★★

COMMENTS